గెడ్డలు ఘోరం..!



రైల్వే న్యూకాలనీ సింహగిరి లాడ్జి పక్కన అధ్వానంగా ఉన్న గెడ్డ

- 42, 45 వార్డుల్లో పూడికలతో నిండిన వైనం
- పారిశుధ్య నిర్వహణ లోపంతో కానరాని శుభ్రత
- వ్యర్థాల డంపింగ్, దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42, 45 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న గెడ్డలు ఘోరంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా తాటిచెట్లపాలెం హైవే పక్కన గల గెడ్డ, 80 ఫీట్ రోడ్‌లోని తాటిచెట్లపాలెం బజార్ పక్కన గల గెడ్డ, రైల్వే న్యూకాలనీ శివాలయం వీధిలోకి వెళ్లే దారిలో కేవీ క్వార్టర్స్‌ను ఆనుకుని ఉన్న గెడ్డ, రైల్వే న్యూకాలనీ సింహగిరి లాడ్జి పక్కనే గల గెడ్డలు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిని ఆనుకుని నివసిస్తున్న ప్రజలు భయాందోళనలతో గడుపుతున్నారు. ఒక పక్క దుర్గంధం.. మరో పక్క వ్యాధులను వ్యాపింపజేసే దోమలతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ముంపు భయం..

పారిశుధ్య విభాగం అధికారులు పట్టించుకోకపోవడం.. నిర్వహణ లోపం కారణంగా ఏ సమయంలో గెడ్డలు పొంగి ఇళ్లలోకి ప్రవహిస్తాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వేసవిలో కాస్త పరవాలేదనుకున్నా, ఏ మాత్రం వర్షాలు కురిసినా గెడ్డల్లో ఉన్న మురుగు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరుతుంది. కొన్ని చోట్ల ఇళ్ల పక్కనే గెడ్డలు ఉండటంతో స్థానికులు చెత్తాచెదారాన్ని వాటిలోకే విసిరేస్తున్నారు. **తాటిచెట్లపాలెం బజార్‌లో పలువురు వ్యాపారులు వ్యర్థాలను పక్కనే ఉన్న గెడ్డలో** నిత్యం పారబోస్తున్నారు. తాటిచెట్లపాలెం హైవే పక్కనే గెడ్డను ఆనుకుని ఉన్న చీపుర్ల వ్యాపారులు తమ చెత్తను అందులోనే వేయడంతో గెడ్డ తరుచూ నిండిపోతోంది.

కానరాని రక్షణ గోడలు

జాతీయ రహదారిపై తాటిచెట్లపాలెం పెట్రోల్ బంక్ పక్కన గల గెడ్డకు రక్షణ గోడలు లేవు. 80 ఫీట్ రోడ్డులోని గెడ్డలది ఇదే పరిస్థితి. రక్షణ గోడలు లేని ఈ గెడ్డల వద్ద ఏ మాత్రం ఆదమరచినా నేరుగా వాటిలో పడాల్సిందే. పిల్లలు, వృద్ధులు ఏమరుపాటుగా ఉన్నా, చీకట్లో సరిగా గమనించకపోయినా గెడ్డలోకి పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గెడ్డలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



తాటిచెట్లపాలెం బజార్ వద్ద రక్షణ గోడ లేని గెడ్డ



80 ఫీట్ రోడ్డులోని రైల్వే క్వార్టర్స్ - కేవీ స్కూల్ మధ్యలో వ్యర్థాలతో నిండిన గెడ్డ

అవగాహనతోనే సమస్య పరిష్కారం

రైల్వే క్వార్టర్స్‌ను ఆనుకుని ఉన్న గెడ్డ నిత్యం వ్యర్థాలతో నిండిపోతోంది. తీవ్ర దుర్గంధం వ్యాపిస్తూ, చుట్టుపక్కల వారికి అసౌకర్యంగా ఉంటుంది. చికెన్, చేపల వ్యర్థాలను గెడ్డలో పారేస్తుండటంతో మరింత దుర్వాసన వెలువడుతోంది. జీవీఎంసీ అధికారులు, శానిటరీ సిబ్బంది స్థానికులకు, వ్యాపారులకు అవగాహన కల్పించి, గెడ్డల్లో చెత్త వేయకుండా చూడాలి.

– నరేంద్రకుమార్, రైల్వే న్యూకాలనీ

రక్షణ గోడలు లేక భయం భయం

తాటిచెట్లపాలెం బజార్ వద్ద, హైవే పెట్రోల్ బంక్ వద్ద గెడ్డలకు సరైన రక్షణ గోడలు లేవు. రాత్రి వేళ ఎవరైనా గమనించకుండా ఇలా వస్తే గెడ్డలో పడిపోయే ప్రమాదముంది. పాదచారులు, పిల్లలు ఏమరుపాటుగా ఇటు వైపు వస్తే అంతే సంగతులు. గెడ్డల వద్ద రక్షణ గోడలు నిర్మించి, ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి.

– మధుసూదన్, తాటిచెట్లపాలెం

గెడ్డలను శుభ్రం చేయాలి

ఎగువ ప్రాంతాల నుంచి చెత్తాచెదారం గెడ్డల్లోకి వచ్చి చేరడంతో అవి ప్రమాదకరంగా మారాయి. తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులోని గెడ్డ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి, రోడ్డుపైకి పొంగిపోయేలా ఉంది. గెడ్డలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచితే మురుగు నీరు ఏ ఆటంకం లేకుండా దిగువకు ప్రవహిస్తుంది.

– దుర్గారావు, తాటిచెట్లపాలెం

క్లుప్తంగా

మహిళల భగవద్గీత పారాయణ



భగవద్గీత పారాయణ చేస్తున్న మహిళలు

మురళీనగర్: స్థానిక రామాలయంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రుల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం సీతారామలక్ష్మణులకు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 6వ తేదీన సీతారాముల కల్యాణం నిర్వహించనున్న సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ఎస్.జయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలు భగవద్గీత పారాయణం చేశారు. వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు, ఇతర సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పక్కాగా ఒంటి పూట బడుల అమలు

విశాఖ విద్య: వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న దృష్ట్యా అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఒంటి పూట బడులు పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో సూచించారు. తొమ్మిది, పదో తరగతులకు ప్రత్యేక తరగతులు పేరిట రెండు పూటలా నిర్వహిస్తున్నట్లు తమ కమిషన్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదులు అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు ఉండబోవని, ఒంటి పూట బడులు అమలు జరపాల్సిందేనన్నారు. తమ కమిషన్ ఆదేశాలు, ప్రభుత్వ ఉత్తర్వులు పాటించని పాఠశాలల యాజమాన్యాలపై డేగకళ్లతో పర్యవేక్షణ జరపడంతోపాటు ఆయా స్కూళ్ల గుర్తింపు రద్దు, క్రిమినల్ చర్యలకు వివిధ సిఫార్సులు చేస్తామని చెప్పారు.

మలేరియా, డెంగ్యూ రికార్డుల అందజేత



ల్యాబ్ టెక్నీషియన్లకు రికార్డులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతంపేట: జిల్లాలో ఉన్న అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో గల ల్యాబ్‌లలో డెంగ్యూ, మలేరియా రిజిస్టర్లు, చార్టులు పూర్తి స్థాయిలో నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. ఇటీవల కొత్తగా రూపొందించిన మలేరియా, డెంగ్యూ రిజిస్టర్లు, చార్టులను స్థానిక సీతంపేటలో గల వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 73 ప్రాథమిక, పట్టణ, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న అన్ని రకాల మలేరియా డెంగ్యూ రిజిస్టర్లు, చార్టులు సక్రమంగా నిర్వహించి సకాలంలో డైలీ, వీక్లీ, మంత్లీ, యాన్యువల్ రిపోర్టులు అందజేయాలని ల్యాబ్ టెక్నీషియన్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో చిత్రాడ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో అవస్థలు



శంకరమఠం రోడ్డులో తిష్ట వేసిన భారీ వాహనం

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు శంకరమఠం రోడ్డు, (భగత్ సింగ్ కాలనీ), ఇందిరా సంజయ్ భీమ్‌నగర్ (ఐఎస్‌బీ నగర్) కాలనీ ప్రాంతాల్లో భారీ వాహనాలు రాత్రీ పగలూ తేడా లేకుండా రోడ్డుపైనే తిష్ట వేయడంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిన్న రోడ్లలో సైతం భారీ వాహనాలు నిలిపివేయడంతో రాకపోకలు ఎలా అని స్థానికులు మండిపడుతున్నారు. ఇటు ఫోర్టుటౌన్ పోలీస్‌స్టేషన్ సిగ్నల్ నుంచి శాంతిపురం మీదుగా ద్వారకానగర్, డైమండ్ పార్కుకు వచ్చే వాహనాల రాకపోకలు ఈ రోడ్డు మీదుగానే జరుగుతాయి. దీంతో నిత్యం ఈ జంక్షన్ రద్దీగా ఉంటుంది. అలాగే ఈ రోడ్డులో రైస్, ఇనుప సామగ్రి షాపులు, హోటళ్లు, హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. ఇవి రోడ్డును సగానికి పైగా ఆక్రమించి ఉంటాయి. ఈ నేపథ్యంలో భారీ వాహనాలను రోడ్డు పక్కన నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్ జామ్ కావడమే కాకుండా రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కరవు



గురుద్వారా సమీపంలో ఫెన్సింగ్ ధ్వంసమైన గ్రీన్‌బెల్ట్

సీతంపేట: జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌కు పలు ప్రాంతాల్లో రక్షణ కరవైంది. గురుద్వారా కూడలి సిక్కు ప్రార్థనా మందిరం నుంచి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్‌కు ఫెన్సింగ్ లేకపోవడంతో కొన్ని చోట్ల గ్రీన్‌బెల్ట్ ప్రాంతం ఆక్రమణకు గురికాగా.. మరికొన్ని ప్రాంతాల్లో దుకాణాల ముందున్న గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమించి తమ వ్యాపారాలకు వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వంలో హైవేపై పలు చోట్ల గ్రీన్‌బెల్ట్ ప్రాంతానికి రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పార్కులుగా అభివృద్ధి చేశారు. ప్రస్తుత అధికార యంత్రాంగం స్పందించి, గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చెయ్యాలని పలువురు కోరుతున్నారు.

రామాయణంలో లవకుశుల పాటలు



ప్రవచిస్తున్న ఆచార్య కోలవెన్ను మలయవాసిని

సీతంపేట: లలితా పీఠంలో జరుగుతున్న వసంత నవరాత్రుల్లో భాగంగా రామాయణ ప్రవచనాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్త్రీల రామాయణ పాటల్లో లవకుశుల పాటలపై ఆచార్య కోలవెన్ను మలయవాసిని ప్రసంగించారు. వాల్మీకి రామాయణంలో సీతను రాముడు విడిచిపెట్టడమే ఉంది కాని, స్త్రీల పాటల్లో రాముడు ఆమెను సంహరించమని లక్ష్మణుడిని ఆజ్ఞాపించినట్టు ఉందని, ఆ సందర్భంగా ఊర్మిళ మొదలైన వారి భావాలకు సంబంధించిన పాటలను గానం చేశారు. లవకుశుల రామ కథా గాన విశేషాలను వివరించారు. లవకుశులు పాడిన నాలుగు పెద్ద పాటలను మలయవాసిని మధురంగా గానం చేసి అలరించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ప్రసంగకర్తను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత డి.వి.సూర్యారావు, కందాల కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉపాధి అవకాశాలు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిసెట్–2025 ప్రవేశ పరీక్షకు సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయ్యిందని, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జి.గణేష్ ఆదేశాల మేరకు పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్నామన్నారు. ముందుగా ఇచ్చిన సమాచారం మేరకు టెన్త్ పూర్తి చేసిన వారు, పదో తరగతి పరీక్షలు రాసిన 200 మంది విద్యార్థులు శిక్షణ తరగతులకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. బాలబాలికలకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తామన్నారు. స్టడీ మెటీరియల్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించి విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

సవరణ బిల్లుపై పెన్షనర్ల నిరసన



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

డాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వం గత నెల 25న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పెన్షన్ నిబంధనల సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పెన్షనర్ల సంఘాలు గురువారం తీవ్ర నిరసన చేపట్టాయి. డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద జాయింట్ ఫోరం ఆఫ్ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ ఫోరం ఆఫ్ బీఎస్ఎన్ఎల్ ప్రతినిధులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దొడ్డి దారిన ఆర్థిక బిల్లు రూపంలో పెన్షన్ సవరణ బిల్లు ప్రవేశపెట్టిందన్నారు. ఫలితంగా దేశంలోని 65 లక్షల మంది పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. గతంలో పెన్షన్ అనేది దయా భిక్ష కాదని, అది ప్రభుత్వ ఉద్యోగి హక్కు అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పలువురు వక్తలు పేర్కొన్నారు. పెన్షనర్ల హక్కులకు భంగం కలిగించే ఈ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని, పెన్షనర్ల హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. 8వ వేతన సంఘం నివేదికలో బీఎస్ఎన్ఎల్ పెన్షన్ సవరణ అంశాన్ని కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్, భారత్ పెన్షన్ సమాజ్ వంటి అనేక ట్రేడ్ యూనియన్ సంస్థలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎంఆర్ పట్నాయక్, ఎ. చిట్టిబాబు, కె. సోమసుందరం , వరప్రసాద్, అచ్యుతరావు, అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు పైడిరాజు

మురళీనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ పోరాటం సాగిస్తుందని పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. విశాఖలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ విశాఖ జిల్లా మహాసభల నిర్వహణకు సంబంధించి మాధవధారలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉత్తర నియోజకవర్గ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ మూడోసారి అధికారం చేపట్టాక రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. వక్ఫ్ బోర్డుకు నూతన చట్టం తీసుకొచ్చి కలతలు సృష్టించి భయభ్రాంతులకు గురిచేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలకు పట్టణాల్లో రెండు సెంట్ల స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం హామీ తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పార్టీ మాధవధార జోన్ కార్యదర్శి గొరీశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి నెయ్యల నాగభూషణరావు, కంచరపాలెం కార్యదర్శి వి.నల్లయ్య, ఎస్.నుకాలమ్మ, మర్రిపాలెం కార్యదర్శి కె.కృష్ణారావు, సహాయ కార్యదర్శి సీహెచ్.సత్యనారాయణ, ఎస్. అప్పన్న, ధనలక్ష్మి, సూరిబాబు, ఆదినారాయణ, సత్యవతి, అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి సారించండి

అల్లిపురం: స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని జోన్–4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు సూచించారు. వెంకటేశ్వరమెట్ట సచివాలయంలో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రేటర్ విశాఖ మంచి ర్యాంకు సాధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సచివాలయం సిబ్బంది, ఆర్పీలను కోరారు. ప్రజలను కలిసి వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ టి.సీతారామయ్య, ఆర్పీలు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు



గణేష్‌నగర్ శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో రామయ్య

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని రామాలయాలు శ్రీరామనవమి వేడుకలకు సిద్ధమవుతున్నాయి. నక్కవానిపాలెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రామాలయంలో ఈ నెల 6న శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ రాట మహోత్సవం నిర్వహిస్తామన్నారు.

- 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, శ్రీ అయ్యప్ప, షిర్డీసాయి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. ఈ నెల 6న ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు. దీనిలో పాల్గొనే దంపతులు రూ.350 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.
- 14వ వార్డు గణేష్‌నగర్‌లోని శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో ఆదివారం శ్రీరాముడికి అభిషేకం, సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు.



నక్కవానిపాలెం రామాలయంలో సీతారాములు

- ఏఎస్ఆర్ నగర్ కొండపై గల ఆంజనేయ స్వామి ఆలయంలో నవమి పూజలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.
- బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. సీతమ్మధారలోని ఇతర ప్రాంతాల్లో కొలువైన రామాలయాల్లో శ్రీరామ నవమి పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ప్రేమోన్మాదిని శిక్షించాలి

మహారాణిపేట: మధురవాడ స్వయంకృషినగర్‌లో ప్రేమ పేరుతో ఉన్మాదిగా మారి, పెళ్లికి నిరాకరించిన అమ్మాయి దీపికపై దాడికి పాల్పడి, అడ్డు వచ్చిన ఆమె తల్లిని దారుణంగా హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా, మహిళా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కేజీహెచ్ మార్చురీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు పి.మణి మాట్లాడుతూ తక్షణం హోమ్ మంత్రి అనిత బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. మధురవాడలో నేరాల సంఖ్య విపరీతంగా పెరిగిన నేపథ్యంలో అదనంగా మరో రెండు పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి, మద్యం విచ్చలవిడిగా దొరకడం వల్ల దారుణాలు పెరిగాయని ఆమె ఆరోపించారు. ఇటీవల మధురవాడలో ఐదేళ్ల పాపపై స్కూల్ మాస్టర్ అత్యాచారం చేసిన ఘటన మరువక ముందే ఇలాంటి దారుణం జరిగిందన్నారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎండీ బేగం, దేవుడమ్మ, పుష్ప, ఐద్వా నాయకులు కొండమ్మ, సుజాత, పద్మ, సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీఐటీయూ నాయకులు ఆర్.కె.ఎస్.వి. కుమార్, ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత నగరంగా తీర్చిదిద్దుదాం

- యువత సహకారంతోనే సాధ్యం
- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



డ్రగ్స్ దుష్పరిణామాల గురించి వివరిస్తున్న సీపీ బాగ్చి

గోపాలపట్నం: సుందర విశాఖను మాదక ద్రవ్యాల రహిత నగరంగా మారుద్దామని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. అందుకు విద్యార్థుల సహకారం అవసరమన్నారు. మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై గోపాలపట్నంలోని ఆదిత్య కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలు బయట వ్యక్తుల వల్ల అలవాటవుతాయని, అలాంటివారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముందు సరదాగా మొదలైనా, తర్వాత అలవాటుగా మారి జీవితాలను నాశనం చేస్తుందని తెలిపారు. మాదక ద్రవ్యాల వల్ల శరీరంలో నాడీవ్యవస్థ దెబ్బ తింటుందని, సంతాన సామర్థ్యం తగ్గుతుందని దృశ్య మాధ్యమం ద్వారా వివరించారు. సైబర్ నేరస్తుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న మోసాల గురించి అవగాహనతో ఉండాలన్నారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల ఇబ్బందుల్లో పడతారని హెచ్చరించారు. కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడవద్దని హితవు పలికారు. ఈగల్ సీఐ కల్యాణి మాట్లాడుతూ ఈగల్ పోలీస్ వ్యవస్థ మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఏర్పాటైందని తెలిపారు. అసాంఘిక శక్తులను అరికట్టేలా పనిచేస్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటివి అమ్ముతున్నా, ఎవరి వద్దనైనా కలిగి ఉన్నా 1972 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారమివ్వాలని సూచించారు. అనంతరం సీపీని కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహనరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ ఎ.బి.పృథ్వీతేజ, గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు, ఎస్ఐ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

సీతమ్మధార: వీఎంఆర్‌డీఏ పరిధిలోని వివిధ పార్కుల్లో గత 30 ఏళ్లుగా పని చేస్తున్న 11 మంది గార్డెన్ కార్మికులను వుడా అధికారులు అన్యాయంగా తొలగించారని ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద తొలగించిన కార్మికులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని లేదా పని చేసిన కాలానికి గ్రాట్యుటీ, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వుడాలో సొసైటీ కార్మికులుగా ఉన్న 11 మందిని 60 ఏళ్లు నిండాయన్న నెపంతో తొలగించడం దుర్మార్గమని, రాష్ట్ర ప్రభుత్వం 62 ఏళ్ల వయో పరిమితి పెంచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గార్డెన్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, వారాంతపు, ప్రభుత్వ, పండగ సెలవులు, గ్రాట్యుటీ వంటి ఏ కార్మిక చట్టాలు అమలు చేయడానికి అధికారులు, వుడా చైర్మన్, కార్మిక శాఖ అధికారులు ఎందుకు పూనుకోవడం లేదని ప్రశ్నించారు. వీరిని తొలగించి 6 నెలలు కావస్తున్నా వుడా కమిషనర్, చైర్మన్, డీసీఎల్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇప్పటికైనా తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలని, లేదంటే కుటుంబాలతో వీఎంఆర్‌డీఏ కార్యాలయం ఎదుట దీక్ష చేపడతామన్నారు. ఈ ధర్నాలో కార్మికులు రాంబాబు, శ్రీను, నర్సింగరావు పాల్గొన్నారు.